క్లుప్తంగా

క్రికెట్ కిట్ బహూకరణ



జట్టుకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం గ్రామంలోని కొత్తపేటవీధి క్రికెట్ జట్టుకు తిమ్మాపురం ఏఎస్ఐ బొల్లంరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, ఆత్రేయపురం ఉదయ్ సమకూర్చిన క్రికెట్ కిట్‌ను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు బహూకరించారు.

నేటి నుంచి రజత దశావతార అలంకారోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం నుంచి జనవరి 12 వరకూ రజత దశావతార అలంకారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ధనుర్మాస వ్రత మహోత్సవాల సందర్భంగా జనవరి 9 రాత్రి 7.30కు, 10న తెల్లవారుజామున 5 గంటలకు స్వామి వారికి బేడా ఉత్సవం జరుగుతాయన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 10న స్వామి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యండమూరులో రెవెన్యూ సదస్సు

కరప: మండలం వేళంగిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి, రైతుల నుంచి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండల సర్వేయర్ ఎస్.రూపావతి, రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో బుక్‌స్టాల్ స్వాధీనం



షాపులో స్టేషనరీ తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎదుట ఉన్న బుక్‌స్టాల్‌ను కళాశాల ఇంజినీరింగ్ సిబ్బంది మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గత రేండేళ్లుగా షాపును నిర్వహకుడు తీయకపోవడంతో పాటు నెలవారీ చెల్లించే అద్దెను చెల్లించకపోగా కళాశాల అధికారులకు ఏవిధమైన సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యాడు. దీంతో కళాశాల ఇంజినీరింగ్ అధికారి సన్నీ ఫ్రాన్సిస్ పోలీస్, రెవెన్యూశాఖ సమక్షంలో షాపు తెరచి అందులో ఉన్న పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి తొలగించి షాపును స్వాధీనం చేసుకున్నారు. ఈ షాపు క్యాంటిన్‌కు కేటాయించినట్లు కళాశాల డీఆర్ శ్రీనివాస్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



కరపలోని వేణుగోపాలస్వామి

కరప: స్థానిక విష్ణాలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఏటా ధనుర్మాసంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ప్రధాన అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ, సూర్యనారాయణ, వేదపండితులతో కల్సి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహించారు. కరప పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులు గోన చిన్నయ్య, యాళ్ల రాంబాబు, గొర్రెల శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

కాకినాడ రూరల్: సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలో 7 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు సీఐ పెద్దిరాజు తెలియజేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపచగా ముగ్గురికి రెండు రోజుల పాటు జైలు, నలుగురికి రూ.10 వేల చొప్పన జరిమానా మేజిస్ట్రేట్ విధించినట్టు మంగళవారం ఆయన తెలిపారు.

తారలు దిగి వచ్చిన వేళ..!

- ముస్తాబైన చర్చిలు
- నగరానికి విద్యుత్ కాంతుల శోభ
- ప్రత్యేక ఆరాధనలకు ఏర్పాట్లు పూర్తి

నాగమల్లితోట జంక్షన్: మనల్ని రక్షించేందుకు మనకు తన ప్రేమను పంచేందుకు.. మన పాపాలను క్షమించేందుకు... కన్య మరియ గర్భాన పుట్టాడు క్రీస్తు. డిసెంబరు 24 అర్ధరాత్రి ప్రపంచమంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు నీతి సూర్యుడు ఉదయించాడు. క్రీస్తు జననం సర్వమానవాళికి పాప విమోచనం. నక్షత్రాలు దివి నుంచి భువికి దిగివచ్చాయా..! ప్రార్థనాలయాలపై కొలువుదీరాయా... అన్నట్టుగా కాకినాడ నగరంలో చర్చిలు వెలుగులు విరజిమ్ముతున్నానయి. విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో వీధులన్నీ శోభాయమానంగా తయారయ్యాయి. సర్వ మానవాళికి శాంతి, ప్రేమ, దయను బోధించిన క్రీస్తు పుట్టిన రోజును భక్తి శ్రద్ధలతో నిర్వహించడానికి నగరం ముస్తాబైంది. క్రిస్మస్ పండగకు నగరంలోని క్రైస్తవులు సిద్ధమయ్యారు. నగరంలో మంగళవారం రాత్రి నుంచే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమైనాయి. రోమన్ కేథలిక్, లూథరన్ చర్చిల ఆధ్వర్యంలో రాత్రి నుంచి నిర్వహించే ప్రత్యేక ఆరాధన, కేండిల్ సర్వీస్‌కు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై లోకరక్షకుని పుట్టిన రోజును జరుపుకొన్నారు. నగరంలో జగన్నాథపురంలోని రోమన్ కేథలిక్ చర్చి, సీఎస్ఐ చర్చి, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, అర్బన్ తహసీల్దార్ సెంటర్‌లోని క్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి తదితర చర్చిలలో క్రిస్మస్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఆరాధనలో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా నగరంలో పలు బేకరీల్లో క్రిస్మస్ కేకులు విక్రయానికి సిద్ధమయ్యాయి.

క్రీస్తు జననానికి గుర్తు..

కాకినాడ రూరల్: ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా నిర్వహించే పండుగ క్రిస్మస్ అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంతి జనరల్ మేనేజర్ ఐ.ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. డిసెంబర్ మాసం వచ్చిందంటే క్రిస్మస్ గుర్తుకొస్తుందన్నారు. క్రీస్తు బోధనలను ఆచరిస్తూ అందరూ కరుణ, దయ, ప్రేమతత్వంతో మెలగాలని చెప్పారు. ఈ సందర్భంగా బాల బాలికలకు క్రిస్మస్ టోపీలు పంచారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఎ.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ చేయూత ఆధ్వర్యంలో..


బోట్‌క్లబ్: కుల మతాలకు అతీతంగా క్రిస్మస్ పండగ నిర్వహించుకోవడం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన ఆశయమని సంస్థ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ అన్నారు. రోటరీ చేయూత భవన్‌లో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడులు నిర్వహించారు. విద్యాశాఖ ఏడీ వినయ్‌మోహన్, సంస్థ ప్రధాన కార్యదర్శి ఆలీ, ఆర్థిక కార్యదర్శి నారాయణ మూర్తి, ఇందిర, వీర్రాజు, విజయ్, వర్మ, శ్రీరామ్ పాల్గొన్నారు.

యంగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో..

బాలాజీచెరువు: యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చిన్నారి జాహ్నవితో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇటీవల దాదాపు 80 శాతం శరీరం కాలిపోయిన స్థితిలో జాహ్నవికి యంగ్‌మైండ్ సంస్థతో పాటు దాతలు ఆర్థిక సహాయం చేసి వైద్యం చేయించారు. వైద్య సిబ్బంది, సంస్థ వ్యవస్థాపకులు వాకాడ వెంకట రమణ కలిసి ఆ చిన్నారితో కేక్ కట్ చేయించి త్వరగా కోలుకుని తిరిగి పాఠశాలకు వెళ్లాలని ఆశీర్వదించారు.



క్రైస్తవులకు శుభాకాంక్షలు



కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రిస్మస్ సందర్భంగా వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి నగరంలోని క్రైస్తవులకు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. సర్వమానవాళికి తన ప్రేమను పంచిన క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. క్రిస్మస్ సందర్భంగా సుఖ సంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు చూపిన శాంతి మార్గంలో జీవించాలన్నారు. క్రిస్మస్ అనేది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకునే పండుగ అని, దేవాది దేవుని దీవెనలు కాకినాడ నగర ప్రజలపై ఎప్పుడూ ఉండాలని పేర్కొన్నారు.



చిన్నారులకు క్రిస్మస్ టోపీలను అందజేస్తున్న ప్రసాద్ నాయుడు



చేయూతలో ప్రీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



చిన్నారి జహ్నవిచే కేక్ కట్ చేయిస్తున్న దృశ్యం

హెచ్‌ఐవీపై అవగాహన



కరపత్రాల ద్వారా ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: స్థానిక ఎస్ఆర్ఎంటీ మాల్‌లో హెచ్ఐవీ నియంత్రణకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ద్వారా అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కుష్ఠు, హెచ్ఐవీ వైద్యులు డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ ఆదివారం నుంచి శనివారం వరకు నగరంలోని వివిధ కూడళ్లలో హెచ్ఐవీ నియంత్రణకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎవరైనా ఈ వ్యాధికి గురైతే జీవితాంతం మందులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. సుఖ వ్యాధులకు కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తి చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ శైలజ, ఎ.బుజ్జి బాబు, రాజా, కరుణ్ కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ దంత వైద్యుల దినోత్సవం



దంతవైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజులను సత్కరించిన రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రముఖ దంత వైద్యుడు, దేశంలో మొదటి దంత కళాశాల స్థాపించిన డాక్టర్ ఆర్. అహ్మద్ జయంతిని జాతీయ దంత వైద్యుల దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. 1948లో బెంగాల్ డెంటల్ సంఘాన్ని ప్రారంభించగా అది నేడు ఇండియన్ డెంటల్ సంఘంగా ఏర్పడిందని అన్నారు. ట్రస్టు నిర్వాహకులు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ సువర్ణ రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, ఎ.రామ్మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లు పీడీఎఫ్ వెంటే

ఎమ్మెల్సీ గోపీమూర్తి విజయోత్సవ సభలో వక్తలు



ఎమ్మెల్సీ గోపీమూర్తి అభినందన సభలో మాట్లాడుతున్న వక్తలు

కాకినాడ సిటీ: యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆ శాఖ అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షతన ఎమ్మెల్సీ గోపీమూర్తి విజయోత్సవ సభ నిర్వహించారు. గోపీమూర్తి ఎన్నికకు సహకరించిన ఉపాధ్యాయ, అధ్యాపకులకు సభలో పాల్గొన్న పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లు సమస్యలపై నిరంతరం పోరాడేది ఒక్క పీడీఎఫ్ ఎమ్మెల్సీ మాత్రమేనని, ప్రతి ఎన్నికలో కాంట్రాక్టు లెక్చరర్లు అందరూ పీడీఎఫ్ వెంటే ఉంటామని అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాణిక్యం వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో యూటీఎఫ్‌ను ఓడించడానికి మిగిలిన అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై విఫల యత్నం చేశాయన్నారు. ఈ రెండు జిల్లాల అధ్యాపక ఉపాధ్యాయులు విజ్ఞతతో, ఎవరైతే సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తారో వారికే మద్దతు ఇస్తామని మరొకసారి చాటి చెప్పారని వివరించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా గెలిచేది ఒక్క పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. చివరిగా ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ ఈ రెండు జిల్లాల్లో తనను ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులు, అధ్యాపకుల హక్కులను సాధించడానికి శాసనమండలిలో కృషి చేస్తానన్నారు. కార్యక్రమలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు సత్తిరాజు, బి.అకోక్, సుందరయ్య, ప్రజా సంఘాల నాయకులు ఎం.రాజశేఖర్, డి.శేషుబాబ్జీ, బేబీ రాణి, రమణి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కేవీవీ నగేష్, టి.రవిచక్రవర్తి, అధ్యాపక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

జేసీ రాహుల్ మీనా



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అండగా ఉంటామని జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకలపూడిలోని ప్యారీ షుగర్స్ రిఫైనరీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీతో పాటు డీసీడీఆర్‌సీ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంత కుమార్, సభ్యురాలు సీహెచ్ సుసి, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, వాటి పరిరక్షణ గురించి వారు అవగాహన కల్పించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రభుత్వం పాత్రను జేసీ రాహుల్ మీనా తెలియజేసి, ఆన్‌లైన్‌లో కొనుగోలు ద్వారా వినియోగదారులు ఎక్కువగా మోసపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గంటా సత్యనారాయణ, చాగంటి నాగేశ్వరరావు తదితరులు వినియోగదారుల సక్సెస్ స్టోరీలను వివరించారు.

28న వేద స్వస్తి

బోట్‌క్లబ్: బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ నెల 28న స్థానిక రామారావుపేటలోని వేద విజ్ఞాన ప్రతిష్ఠానమ్‌లో వేద స్వస్తి నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణ మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ వేద స్వస్తి ప్రారంభమవుతుందన్నారు. గరిమెళ్ల లక్ష్మీనారాయణ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విశ్రాంత జీవికి బాసట

- ఇంటి వద్దనే లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్
- సఫలమైన తపాలా శాఖ ప్రయోగం



విశ్రాంత ఉద్యోగి బయోమెట్రిక్ తీసుకుంటున్న తపాలా ఉద్యోగి (ఫైల్)

బాలాజీచెరువు: విశ్రాంత జీవులకు విశ్రాంతి లేకుండా చేసే నెల నవంబర్. ఆ నెలలో తమ జీవన ధ్రువపత్రాన్ని ఏటా నవంబర్, డిసెంబర్‌లో ఖజనా విభాగానికి అందించాల్సి ఉంటుంది. అది ఇవ్వకపోతే వారు లేనట్టుగా ధ్రువీకరించుకుని ఖజానా శాఖ సదరు విభాగానికి వారి పింఛను నగదు పంపిణీ నిలిపివేస్తుంది. ఆ పరిస్థితి తలెత్తకుండా ముందుగానే విశ్రాంత జీవులు ఆ నెలలో వారి జీవన ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం వారు ఇప్పటి వరకు వారి పెన్షన్ జమ అయ్యే ఖాతా ఉన్న బ్యాంకుకు వెళ్లి అక్కడి బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ధ్రువపత్రాన్ని పంపడమో, లేదా వారి పెన్షన్ ఏ ప్రభుత్వ శాఖ వారు ఇస్తారో ఆ విభాగాధిపతి సమక్షానికి వెళ్లి దరఖాస్తు పూర్తిచేసి ఇవ్వడమో జరుగుతోంది. ఇంత తతంగం, శ్రమ అవసరం లేకుండా విశ్రాంత జీవుల కోసం తపాలాశాఖ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విశ్రాంత ఉద్యోగులకు ఇంటివద్దనే లైవ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో నమోదు చేసే సదుపాయం అందుబాటులోకి తీసుకు వచ్చింది. గతంలో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంక్ (ఐపీబీపీ) ద్వారా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకు ఈ లైవ్ సర్టిఫికెట్ అందుతుండగా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు కూడా ఈ విధానాన్ని వర్తింపజేస్తున్నారు.

ఇప్పటి వరకు వీటిన కోసం జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేస్తున్నా అనారోగ్యంతో లేదా మంచానికే పరిమితమైనవారు, కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యల నుండి వీరికి విముక్తి లభించేలా చర్యలు ప్రారంభమైయాయి. పోస్ట్‌మన్ ఇంటికి వచ్చి వీరి జీవన ధృవపత్రాన్ని ఆన్‌లైన్‌లో అక్కడికక్కడే నమోదు చేయనున్నారు. రాష్ట్ర పెన్షనర్లకు వీటిని వర్తింపజేసేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆన్‌లైన్ చర్యలు విజయవంతమయ్యాయి. ఫలితంగా దీన్ని అమలుచేసేందుకు ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పింఛనుదారులు రాష్ట్రంలో ఏ మూల ఉన్నా ఈ సేవలతో ఉపశమనం పొందవచ్చు. లైఫ్ సర్టిఫికెట్ జారీకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 30వ తేదీలోగా గడువు ఉండగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే ఫిబ్రవరి నెలాఖరు వరకూ గడువు ఉంది. కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం ఆధీనంలో రెండు హెడ్ పోస్టాఫీసులు, 54 సబ్ పోస్టాఫీసులు, 284 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులు 725 మంది ఉండగా రాష్ట్ర పింఛనుదారులు 25 వేల మంది వరకూ ఉన్నారు.

కావలసిన పత్రాలు ఇవీ

విశ్రాంత ఉద్యోగి పింఛను ఐడీ కార్డు, ఆధార్ కార్డు, పింఛను చెల్లింపు పత్రాలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఉపయోగంలో ఉన్న ఫోన్ నంబర్, ఖజనా కార్యాలయ చిరునామా కచ్చితంగా పొందుపరచాలి.

ఇంటి వద్దనే సేవలు



లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయంతో పెన్షనర్లకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రత్యేక యాప్‌తో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పెన్షనర్లు ఇంటి వద్దనే ఉండి ఈ యాప్‌ను తమ స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. దీని ద్వారా బుక్ చేసిన పోస్టుమేన్ ఇంటికి వచ్చి బయోమెట్రిక్ చేయించడం ద్వారా అక్కడిక్కడే లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేస్తారు. ఇందుకు గాను రూ.70 రుసుంగా చెల్లిస్తే సరిపోతుంది.

– సీహెచ్ శ్రీనివాసరావు, పోస్టల్ సూపరిండెంట్, కాకినాడ

రాజేశ్వరి సేవలు మరువరానివి

మాజీ ఎంపీ వంగా గీత



దివంగత మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పట్టణానికి చేసిన సేవలు మరువరానివని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. స్థానిక రాజా రామ్మోహన్ రాయ్ పార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీసీ కార్యదర్శి మేడిది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ రాజేశ్వరి పిఠాపురం మున్సిపాలిటీకి ప్రథమ మహిళా చైర్మన్‌గా పని చేసి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్లిపూడి రాంబాబు, పంతం నెహూ, గండేపల్లి బాబి, వరినిడి సుజాత, గుణ్ణం మైదిలి, ఆగంటి ప్రభాకర్, రెడ్డెం జనార్దన్, తలిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపులో అధికారుల దాడులు

కొత్తపల్లి: పిఠాపురం పట్టణంలోనిఆరుద్ర మొబైల్ షాపులో మంగళవారం సేల్స్ అధికారు లు దాడులు నిర్వహించారు. వారికి అందిన సమాచారం మేరకు అధివారులు దాడులు చేశారు. షాపులో బిల్లులు లేకుండా సెల్ ఫోన్లు విక్రయిస్తున్నట్టు, ఆధారాలు లేని ఫోన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే వివరాలు అడిగేందుకు వెళ్లిన విలేకరులపై షాపు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. విలేకరులకు అధికారులు సమాచారాన్ని తెలియజేసేందుకు నిరాకరించారు.